

బస్సు యాత్రకు దప్పులతో స్వాగతం



మహిళల కోలాట సందడి



జనసంద్రంగా మారిన వీధులు



ఏకలవ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే కిలారి, నేతలు



బస్సు యాత్రకు ఘన స్వాగతం

సామాజిక సాధికార బస్సు యాత్రతో పొన్నూరు నగరం జనసంద్రంగా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు సాగిన బస్సు యాత్రకు వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. బైక్ ర్యాలీతో మద్దతు పలికారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అధ్యక్షతన పార్టీ శ్రేణులు ఒక్కటిగా ముందుకు సాగి యాత్రను విజయవంతం చేశారు. ఐలాండ్ సెంటర్లో ఏకలవ్య కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏకలవ్య విగ్రహాన్ని ఎమ్మెల్యే రోశయ్య ఆవిష్కరించారు. అంబేద్కర్, వై.ఎస్.ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్లుప్తంగా

నేడు మండల పరిషత్ అధ్యక్ష పదవికి ఎన్నికలు

గుంటూరు రూరల్: మండలంలో ఖాళీగా ఉన్న మండల పరిషత్ అధ్యక్ష పదవికి ఈనెల 16న ఎన్నికలు నిర్వహించనున్నామని ఎంపీడీవో ఆదినారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారుల ఉత్తర్వుల ప్రకారం ఎన్నికల అధికారిగా ఎల్. వజ్రశ్రీ విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. నగరంలోని మండల పరిషత్ కార్యాలయం నందున్న సమావేశ మందిరంలో గురువారం ఉదయం 11 గంటలకు ఈ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు హాజరవ్వాలని ఆయన కోరారు. ఎన్నికల్ని ప్రొసీడింగ్ అధికారి పర్యవేక్షణలో నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ గమనించాలని ఆయన సూచించారు.

వీవీఐటీలో 'మై నేమ్ ఈజ్ శృతి' చిత్ర బృందం సందడి



పెదకాకాని: హన్సికా కీలక పాత్రలో ఓంకార్ శ్రీనివాస్ దర్శకత్వంలో వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై రూపొందుతున్న లేడీ ఓరియంటెడ్ 'మై నేమ్ ఈజ్ శృతి' చిత్ర బృందం వీవీఐటీలో సందడి చేసింది. ఈ నెల 17 న విడుదల కానున్న దృశ్యా చిత్ర ప్రచారంలో భాగంగా బృందం బుధవారం నంబూరు వీవీఐటీని సందర్శించింది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వాస్తవ ఘటనలను స్ఫూర్తిగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించామని తెలిపారు. మహిళలు పురుషుల కంటే బలమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటారన్నదే ఈ చిత్ర సారాంశమని వివరించారు. హీరోయిన్ హన్సికా మాట్లాడుతూ కమర్షియల్ హంగులతో సామాజిక అంశాన్ని ప్రేక్షకులకు తెలియజేయడమే ఈ చిత్రం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం చిత్ర బృందం విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేసింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

నేడు కొత్తరెడ్డిపాలెంలో బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ



బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: దృష్టి లోపం సమస్య మాత్రమే కాదని, మనిషికీ – ప్రపంచానికీ మధ్య అడ్డుగోడ వంటిదని, దీన్ని పటాపంచలు చేసే దిశగా బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి పేరిట నిర్విరామ కృషి చేస్తున్నట్లు వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెంలో నవంబర్ 12న బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరంలో అవసరమైన 791మందికి కళ్లజోళ్లను సిద్ధం చేశామని పేర్కొన్నారు. కొత్తరెడ్డిపాలెంలోని యంగ్ ఇండియా స్కూలు ప్రాంగణంలో గురువారం సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు మహిళలకు, 5 గంటల ఉంచి 7 గంటల వరకు పురుషులకు కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని ఆయన వెల్లడించారు. బజరంగ్ నేత్రజ్యోతి శిబిరంలో కళ్లజోళ్ల ఆవశ్యకతను గుర్తించబడిన వారు అందుబాటులో ఉండి వాటిని పొందాలని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సీహెచ్. రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా రంపచోడవరం గ్రామానికి చెందిన కురపం సూరిబాబు (25) మిర్చి యార్డు వద్ద కూలీ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. యార్డు సమీపంలో రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన విషయం తెలిసిన నల్లపాడు పోలీసులు, ట్రైనీ డీఎస్పీ గీతాకుమారి సంఘటన స్థలికి చేరుకుని వివరాల్ని సేకరించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి, మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నల్లపాడు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

- జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు
- వెంగళాయపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్ డోర్ టు డోర్ కార్యక్రమం

గుంటూరు రూరల్: రాష్ట్రంలో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు అందాలన్నా మరలా ముఖ్యమంత్రిగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా మాత్రమే సాధ్యమని రూరల్ మండలం జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మల సుబ్బారావు తెలిపారు. మండలంలోని వెంగళాయపాలెంలో బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని ఇంచార్జి ఎంపీపీ ఇంటూరి పద్మావతితో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ నేటి వరకు వెంగళాయపాలెంలోని సచివాలయం– 1 పరిధిలో రూ. 45 కోట్లు, సచివాలయం– 2 పరిధిలో రూ. 23 కోట్లను సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు జగనన్న అందజేసినట్లు వెల్లడించారు. గ్రామంలో సుమారుగా నేటికి మరో రూ. 10 కోట్ల విలువైన అభివృద్ధి పనుల్లో కొన్ని పూర్తయ్యాయని, మరికొన్ని పూర్తయ్యే దశలో ఉన్నాయని వివరించారు. ఒక్క గ్రామానికే సుమారు రూ. 100 కోట్లను ఐదేళ్లలో అందజేసిన మన జగనన్న మరోసారి ముఖ్యమంత్రి అయితే అభివృద్ధి పరుగులు తీస్తుందని చెప్పారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఇంచార్జి ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ఎన్నికల హామీల్లో ఇచ్చిన ప్రతి హామీని ఏడాదిలోనే పూర్తి చేశారని గుర్తు చేశారు. ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉండాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయం పరిధిలో నేటి వరకూ అందజేసిన సంక్షేమ పథకాల పట్టికను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ చేసి, గ్రామంలోని ఇంటింటికీ వెళ్లారు. ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల్ని నేతలు వివరించారు. వారితో ప్రభుత్వానికి ఎన్ని మార్కులు పడతాయో తెలుసుకుని వారి అనుమతితో స్టాంప్ వేయించుకున్నారు. అనంతరం గ్రామంలోని పార్టీ కార్యకర్త ఇంట్లో రాత్రి బస చేశారు. స్థానిక పెద్దలతో వారి సమస్యలు, పరిష్కారాలు, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్, దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు కాకాని రమేష్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సర్పంచి లలితకుమారి, వైఎస్సార్ సీపీ నేత కలిశెట్టి వెంకటరావు, సచివాలయం కన్వీనర్లు రేటూరి శివబ్రహ్మం, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, అద్దంకి ధర్మారావు, ముువ్వా బుజ్జవ్వ, జయరాజు, బాజీ వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



రాత్రి బసలో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, నేతలు



కుర్నూతలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మన్నవ వీరనారాయణ, సర్పంచి గోపాలకృష్ణ



గార్లపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి

ప్రత్తిపాడు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో నడుస్తున్నారని వైఎస్సార్ సీపీ వట్టిచెరుకూరు మండల కన్వీనర్ మన్నవ వీరనారాయణ పేర్కొన్నారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామసచివాలయం పరిధిలో గురువారం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం' కార్యక్రమాల్ని నిర్వహించారు. మండల కన్వీనర్ మన్నవ వీరన్నారాయణ, గ్రామ సర్పంచి యర్రాకుల గోపాలకృష్ణ రిబ్బన్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సచివాలయం వద్ద జరిగిన సమావేశంలో మన్నవ వీరనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి సీఎం వై.ఎస్. జగన్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందిన లబ్ధిని కుటుంబ సభ్యులకు నేరుగా వివరించాలని సూచించారు. సర్పంచి గోపాలకృష్ణ మాట్లాడుతూ అధికారంలోకి వస్తూనే వృద్ధుల కష్టాలు తొలగించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని తెలిపారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కల్పిస్తూ సముచిత గౌరవాన్ని సీఎం కల్పించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి రవి, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలే అందించడమే లక్ష్యం

గార్లపాడు(కాకుమాను): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి పాలన చేస్తున్నారని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని గార్లపాడులో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అర్హతే అధారంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని అందిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు.జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99శాతం పథకాల్ని నెరవేర్చి అన్ని వర్గాల్ని ఆదుకున్న ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అని కొనియాడారు.ఈ సందర్భంగా గత నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారి వివరాల జాబితాతో పాటు గ్రామ ప్రధాన కూడలిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి కొమ్మాలపాటి రవికుమార్, వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షుడు నల్లమోతు శివరామకృష్ణ, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి సాంబయ్య, మండల ఉపాధ్యక్షులు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనను మరలా కోరుకుంటున్న ప్రజలు

పెదనందిపాడు: జగన్ పాలనలో అర్హత ఉన్నవారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, వారందరూ మరలా రాష్ట్రానికి ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని ఎంపీపీ టి. హెప్సిబా తెలిపారు. మండలంలోని నాగులపాడులో బుధవారం రాత్రి 'పల్లెకు పోదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మరలా రాష్ట్రానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని, వారందరి అభీష్టం మేరకు మరలా ఆయన్ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆమె వివరించారు. అనంతరం వలంటీర్లు, గృహ సారథులకు అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రజలకు సంక్షేమ పథకాల గురించి ఎలా వివరించాలో వారికి శిక్షణ ఇచ్చారు. సంక్షేమ పథకాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా, పెదనందిపాడు, ఏబీపాలెం సొసైటీల అధ్యక్షులు డి. నాగేశ్వరరావు, కె. భూషయ్య, వైఎస్ఎంపీపీ కమ్మ సాంబశివరావు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి సాంబశివరావు, జేసీఎస్ కన్వీనర్ మేడిద రవి, నేతలు గొట్టిముక్కల వెంకటసుబ్బారావు, బండి కిశోర్, బండి ప్రసాద్, కట్టా సునీల్ పాల్గొన్నారు.



వలంటీర్లకు జగనన్న సంక్షేమ పథకాల కిట్లను అందజేస్తున్న ఎంపీపీ హెప్సిబా, నేతలు

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం



రైతులతో కలసి వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పెదకాకాని: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ముఖ్య ఉద్దేశమని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు ఎం. హైమావతి తెలిపారు. మండలంలోని గోళ్లమూడిలో బుధవారం రైతులకు వరిలో విత్తన ఉత్పత్తి పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ పథకానికి ఎంపికైన రైతులు కంకులలోని గింజల్ని సేకరించుకుని తాము నిల్వ చేసుకోవడంతో పాటు గ్రామంలోని రైతులకు కూడా అందించాలని సూచించారు. అనంతరం రైతులతో కలసి బీపీటీ 5204 రకం సాగును క్షేత్ర పరిశీలన చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. సంధ్యారాణి, విస్తరణ అధికారి ఆర్.వి. శివాజీ, గ్రామ వ్యవసాయ సహాయకులు వి. విజయలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం

గుంటూరు రూరల్: నిషేధిత మత్తు పదార్థాల్ని వాడటం చట్టరీత్యా నేరమని ఏటుకూరు శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ పి. పరమేశ్వరి తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏటుకూరు గ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం, వాటివల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ చదువుకునే వయస్సులో నిషేధిత మత్తు పదార్థాలకు అలవాటుపడితే భవిష్యత్తు నాశనమవుతుందని సూచించారు. చట్టరీత్యా జైలుకు కూడా వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం లైబ్రరీలో సభ్యత్వ నమోదు, పరిచయ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పృథ్వీరాజ్, పద్మావతి విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలిన పార్టీ శ్రేణులు

పెదకాకాని: ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల్ని ప్రజలకు తెలియజేసేందుకు బుధవారం ఏర్పాటు చేసిన సామాజిక సాధికార బస్సు యాత్రకు పెదకాకాని మండలం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి పార్టీ జెండాలు, కండువాలతో జై జగన్, జైజై జగన్, సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వర్థిల్లాలి అంటూ రహదారులు దద్దరిల్లేలా నినాదాలతో పొన్నూరు తరలి వెళ్ళారు. రహదారులపై ఎటువైపు చూసినా వైఎస్సార్ సీపీ జెండాలతో ర్యాలీగా వెళుతున్న పార్టీ శ్రేణులే కనిపించారు.



యాత్రకు బయలు దేరిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

వీవీఎం-2023లో ముట్లూరు విద్యార్థుల ప్రతిభ

ప్రత్తిపాడు: విద్యార్థి విజ్ఞాన మంథన్ (వీవీఎం -2023) పోటీల్లో వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అక్టోబరు 29న జిల్లాస్థాయిలో నిర్వహించిన వీవీఎం– 2023 పరీక్షకు ముట్లూరు హైస్కూలు నుంచి 93 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరో తరగతి విద్యార్థిని దేవరకొండ కరుణ రాష్ట్రస్థాయి పరీక్షకు ఎంపికైంది. జిల్లాస్థాయిలో ఇదే పాఠశాలకు చెందిన విద్యార్థులు తోటకూర మహాలక్ష్మి (7వ తరగతి), దూపాటి రవితేజ (8వ తరగతి), మేడికొండూరు గ్రీష్మ (9వ తరగతి), సుఖవాసి రిషిత (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ సందర్భంగా బుధవారంపాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం తెనాలి జోస్ మేరి, నోడల్ ఎంఈవో కె. శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులకు గైడ్ టీచర్లుగా కె. శ్రీనివాసరావు, వి.ఎస్. రామాంజనేయులు, కె. మల్లేశ్వరరావు వ్యవహరించారు.



విద్యార్థిని కరుణని అభినందిస్తున్న హెచ్‌ఎం

తూకంలో తేడాలుంటే కఠిన చర్యలు

గుంటూరు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ జి. కొండారెడ్డి

చేబ్రోలు: గ్యాస్, పెట్రోలు, సరుకుల తూకంలో తేడాలు ఉన్నా, ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ జి. కొండారెడ్డి తెలిపారు. చేబ్రోలులోని భారత్ గ్యాస్ కంపెనీ, చేబ్రోలు, మంచాల గ్రామాల్లోని నాలుగు పెట్రోలు బంక్‌లు, ఎరువులు, పలు కిరాణా షాపుల్ని బుధవారం తూనికలు, కొలతల శాఖాధికారులు తనిఖీ చేసి, నాలుగు కేసులు నమోదు చేశారు. పెట్రోలు బంకులు, గ్యాస్ కంపెనీ వద్ద సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కంట్రోలర్ జి. కొండారెడ్డి మాట్లాడుతూ పెట్రోలు బంక్‌లు, గ్యాస్ కంపెనీ మీద పలు ఫిర్యాదులు అందటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. గ్యాస్ వినియోగదారుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. భారత్ గ్యాస్ కంపెనీలో సిలెండర్ల తూకంలో సమస్యలేదని, ఐదు కి.మీ.లోపు గ్యాస్ వినియోగదారులు అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పారు. 15కి.మీ.లోపు రూ.20, తరువాత రూ.30 వరకు అదనంగా వసూలు చేయాలని తెలిపారు. తనిఖీలో తూనికలు, కొలతల శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అధికారుల తనిఖీలను ముందే తెలుసుకున్న వ్యాపారులు చేబ్రోలులోని ప్రధాన రహదారుల్లోని షాపులు మూసివేశారు.



చేబ్రోలులోని భారత్ గ్యాస్ కంపెనీలో తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు, కొలతల శాఖ అధికారులు

అభ్యంతరాల్ని తహసీల్దార్ల దృష్టికి తీసుకు రండి



ప్రత్తిపాడు: ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలుంటే నేరుగా తహసీల్దార్ల దృష్టికి తీసుకురావాలని గుంటూరు ఆర్డీవో, ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ తెలిపారు. ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ గత నెలలో ప్రచురించిన ఓటర్ల ముసాయిదా జాబితాలు పోలింగ్ బూత్‌లు, బీఎల్‌వోలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నాయకులు, ఓటర్లు ఒక్కసారి స్వయంగా వెళ్లి జాబితాలను పరిశీలించుకోవాలని ఆయన సూచించారు. మార్పులు, చేర్పులు, అభ్యంతరాలున్నా నేరుగా సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఇప్పటికే అందిన అర్జీలు, ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా సర్వే జరిపి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

మిర్చిలో తెల్లదోమ ఉధృతిపై అప్రమత్తత అవసరం

ప్రత్తిపాడు: మిరపలో తెల్లదోమ ఉధృతి అధికంగా ఉందని, రైతులు వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని ఉద్యాన అధికారి ఎం. బేబి సూచించారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు, చమళ్లమూడి గ్రామాల్లో మిరప పొలాల్ని బుధవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి, సాగులో ఎదురవుతున్న సమస్యల్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెల్లదోమ వల్ల జెమిని వైరస్ వ్యాపిస్తుందని తెలిపారు. ఆకు అడుగు భాగాన తల్లి, పిల్ల పురుగులు గుంపులు గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయని చెప్పారు. తెల్లదోమలోని వైరస్ క్రిములు లాలాజలం ద్వారా ఆరోగ్యవంతమైన మొక్కలకు కూడా వ్యాపిస్తాయని వివరించారు. అధిక తేమ, వర్షాభావ పరిస్థితుల్లో తెల్లదోమ పెరుగుతుందని సూచించారు. తెగులు ఆశించిన మొక్కలు ముడుచుకుని పడవ ఆకారంలోకి మారి, ఆకులపై బొబ్బర్లు ఏర్పడటంతో పాటు పాలిపోయి లేత ఆకుపచ్చ రంగుకు మారుతాయని తెలిపారు. కణుపుల మధ్య దూరం తగ్గి మొక్కలు గిడసబారతాయని చెప్పారు. వైరస్ తెగుళ్లకు నివారణ లేదని, సస్యరక్షణ పద్ధతులే మార్గమని బేబి సూచించారు. ముందుగా రసం పీల్చు పురుగుల్ని అరికట్టాలని పేర్కొన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యల్లో భాగంగా రైతులు సామూహికంగా నీలి, తెలుపు, పసుపు రంగు జిగురు అట్టలు ఎకరాకు 40–50 వరకు మొక్క ఎత్తుకు దగ్గరగా పెట్టుకోవాలని సూచించారు. వేప సంబంధిత పురుగు మందులు ఐదు శాతం, వేపగింజల కషాయం, వేపనూనె పిచికారీ చేయాలని తెలిపారు. వేపనూనెను సిఫారసు చేసిన ఇతర మందులతో కలిపి పిచికారీ చేసుకోవచ్చని వివరించారు. ఎసిటామిప్రిడ్ 0.3 గ్రాములు లేదా థయోమిథాక్సిమ్ 0.4 గ్రాములు, డైఫెన్‌థియారాన్ 1.25 గ్రాములు లేదా స్పైరోమెఫిసిన్ ఒక మిల్లీలీటరు ఒక లీటరు నీటికి కలిపి మార్చి మార్చి పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఆమె వెంట రైతు భరోసా కేంద్రం సిబ్బంది వంశీ, సిరాజ్, రైతులు ఉన్నారు.



మిర్చి పంటను ఆశించిన తెగుళ్లను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి ఎం. బేబి

కృష్ణా జలాలపై గెజిట్‌ను కేంద్రం ఉపసంహరించుకోవాలి

పెదకాకాని: కృష్ణా జలాలపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను ఉపసంహరించుకోవాలని సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం పెదకాకాని సెంటర్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 20, 21 తేదీల్లో విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద 30 గంటల నిరసన దీక్షను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కృష్ణా జలాల పునఃపంపిణీపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే పద్ధతుల్లో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో గెజిట్ నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

అర్హతే ప్రామాణికంగా రైతులకు రుణాలు



ప్రత్తిపాడు: అర్హతే ప్రామాణికంగా రైతులు, కౌలు రైతులకు విరివిగా రుణాల్ని అందజేయాలని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో యూనియన్ బ్యాంక్ ప్రత్తిపాడు శాఖ మేనేజర్ సీతారామ్ అధ్యక్షతన బుధవారం మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్యాలకు అనుగుణంగా కర్షకులకు రుణాలివ్వాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఎనిమిదో విడత జగనన్న తోడులో లబ్ధిదారులకు రుణాల్ని త్వరితగతిన మంజూరు చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీమా పథకాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వాహనాలు మండలానికి రానున్నాయని, వాటిని గ్రామాలకు తీసుకువెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బ్రహ్మానందకుమార్ పాల్గొన్నారు.